గణపతికవి ముఖము నుండి బయలు వెడలినదియు, మధు - సుధా - ద్రాక్షాదుల మాధుర్య రసమును క్రిందుపరచునదియు, అగు, ఈ యార్యాగీతిగణము - శర్వాణికి ప్రీతినిడుఁగాత!

ఇతి - శ్రీ మహర్షి రమణభగవత్ పాదాన్తే వాసినో
వాసిష్ఠస్య నరసింహసూనోః గణపతిమునేః కృతా
వుమాసహస్రే ద్వాత్రింశః స్తబకః సమాప్తః॥
సమాప్తంచ - అష్టమశతకమ్.

ఇది శ్రీ మహర్షి - రమణ భగవత్ పాద శిష్యుఁడు, శరమర్షణ
సగోత్రుఁడు
శ్రీ మత్స్యంతుల పేరయ శాస్త్రి పౌత్రుఁడు, వేంకటరామ
బుదేంద్రపుత్రుఁడు, శ్రీ లక్ష్మీనారాయణశాస్త్రిచే
నాంధ్రీకరింపఁబడిన ఉమా సహస్రమను స్తోత్ర
కావ్యమున ముప్పది రెండవ స్తబకము
(8 వ శతకము)

* * * *



ఓం నమోభగవతే శ్రీరమణాయ, శ్రీ భారతీదేవ్యైనమః

# ఉమాసహస్రము

## (తొమ్మిదవ శతకము - ప్రథమ స్తబకము)

## త్రయస్త్రింశ స్తబకము

మూ॥ సుధాంకిరన్తోఽఖిలతాపహారిణీం
తమోహరన్తోపటలేన రోచిషామ్
శ్రియం దిశన్తోదిశిదిశ్య సజ్జయాం
జయన్తిశీతాద్రిసుతాస్మితాఙ్కురాః॥ 1

అఖిల తాపహారిణి (తాపత్రయమును) శమింపఁజేయునది, లేక (వేడిని పోగొట్టునది) యగు సుధను ప్రసరించునవియు, తేజస్సమూహము చేత తమమును (వెలుపలనున్న చీకటిని, లేక అంతరమగు అజ్ఞానమును,) నివారించునవియు, సర్వదిక్కులయందును నశింపని శ్రీని (శోభను, లేక సంపదను) ప్రదర్శించునవియు, అగు శీతాచలకుమారి యొక్క స్మితాంకురములు - జయించుచున్నవి.

ప్రభ:- ఇందు సుధా - తమః - శ్రీ పదముల యందుశ్లేషగలదు. దానిచేత స్మితాంకుర శబ్దార్థ సామర్థ్యము వలన పార్వతీవదనము - చంద్రుఁడను నర్థ మాక్షేపింపఁబడుచున్నది. కావున నిది శ్లిష్టమగు రూపకాలంకారమగుచున్నది.

మూ॥ కృపాకటాక్షస్తవ కేనవాఽప్యతే
మహేశశుద్ధాన్తపురన్ధ్రి! కర్మణా॥
నిరన్తరం మన్త్రజపేనవామతే
ర్విశోధనే నోత మనోర్పణేనవా॥ 2

మహేశ్వరాంతః పురమహిషీ! నీ కృపాకటాక్షము – ఏకర్మనాచరించుట చేత లభించును? నిరంతరమగు మంత్ర జపము (మంత్ర పురశ్చరణము) చేతనా? చిత్త శోధనము చేతనా? మనోర్పణము చేతనా?

**ప్రభ:-** **1** మంత్ర పురశ్చరణము **2.** చిత్త విశోధనము **3.** సంపూర్ణమగు చిత్త సమర్పణము – అనుకర్మలలో, దేనిచేత నీ కరుణాదృగంతపాతము లభించును? అని ప్రశ్నింపఁబడుచున్నది. ఇట్లు – మూడు పాయములను దెలిపి. వానివానికిఁ గల ప్రత్యేకమగు ఫలమును దెలుపుచున్నాఁడు.

మూ॥ విశోధనాద్ దేవి! మతేఃప్రగృహ్యాసే
మనోర్పణేనేశ వధు ప్రసీదసి।
జపేన మన్త్రస్య శుభస్య వర్ధసే
జగత్ త్రయీధాత్రి! కలేబరాన్తరే॥ 3

త్రిలోకభర్త్రీ! దేవీ! బుద్ధిని విశోధించుట వలన చక్కగా గ్రహింపఁబడు చుందువు. ఈశ్వరకాంతా! మనస్సును నీకు సంపూర్ణముగా సమర్పించుట చేత ప్రసన్నురాలవగుదువు. శుభమగు మంత్రమును జపించుట చేత – జపించువాని యొక్క శరీరములోపల వృద్ధి నొందుదువు.

**ప్రభ:-** విచారము చేత, బుద్ధి– పరీక్షింపఁబడునపుడు దుష్టములగు మనోవృత్తులు పలాయితములగును. బోధ స్వరూపిణియగు సద్వృత్తి యొక్కటియే మిగులును. ఆబోధమునందే దేవి – గ్రహింపఁబడును. మనోర్పణము చేత దేవియందే భక్తుని భారమంతయుఁగూడ నుంచఁబడును. దాని వలన ప్రీతయగు మాత – ప్రసన్నయై భక్తుడొనర్పఁదగిన కార్యభారమును తానే వహించును. శ్రీ విద్యామంత్రమును గాని, పంచాక్ష రాష్టాక్షరమంత్రమును గాని, ప్రణవాది మంత్రమును గాని, దేనినైనను **క్షుద్రము కాని మంత్రమును జపించుట చేత**, జప్త యొక్క శరీరాంతరమున – తత్పురశ్చరణబలమునకు తగిన విధమున భగవతి స్వయముగా నభివ్యక్తయగును.



మూ॥ మనః ప్రతాపస్య భవత్యసంశయమ్
ప్రవర్ధనం వైదికమన్త్ర చిన్తనమ్।
ప్రశస్యతే! ప్రాణమహః ప్రదీపనే
దయాన్వితే తాన్త్రికమన్త్రసేవితా॥ 4

దయాన్వితవగు జననీ! ఋషుల చేత కనుఁగొనఁబడిన ''తత్ సవితుః'' ఇత్యాది వైదిక మంత్రధ్యానము – చిత్త ప్రభావమును వృద్ధి నొందించును. ఇందు సందేహము లేదు. శ్రీ విద్యాది తాంత్రికమంత్రోపాసనము – ప్రాణతేజః ప్రదీపనము నొనర్చునని ప్రశంసింపఁబడుచున్నది.

**ప్రభ:-** వేద మంత్రములు – వాక్యబంధాత్మకములు. కావున తాంత్రిక మంత్రముకంటె, వానికి విశిష్టమగు అర్థ ప్రాధాన్యము నెఱుఁగవలయును. మంత్రార్థ విచారము వలన బోధము కలుగును. కావుననే వైదిక మంత్ర ధ్యానము వలన మనఃప్రతాపము వృద్ధి నొందునని చెప్పఁబడినది. హ్రీంకారాది బీజాక్షర రూపములగు తాంత్రిక మంత్రములను జపించుట వలన ప్రాణ నాడీ విశుద్ధి ద్వారమున నాదాభి వ్యక్తి కలుగును. అప్పుడు ప్రాణ ప్రభావము విజృంభించును.

ఈ యంశము ''వైదికమన్త్రే భావవతీ
తాన్త్రికమన్త్రే నాదవతీ'' స్త 20 శ్లో. 17
అని వెనుక చెప్పఁబడినది.

మూ॥ తవామ్బికే! తాన్త్రి కమన్త్రముత్తమం
స్తవాతిగం యః కనకాఙ్గి! సేవతే।
విచిత్రయన్త్రాదివ వైద్యుతం మహ
స్తతో వినిర్యద్ భువనం విగాహతే. 5

కనకాంగివగు జననీ! స్తోత్రాతీతవునను శ్రేష్ఠవునను అగు నీతాంత్రికమంత్రము నుపాసించు వాని నుండి - అద్భుతమగు (లౌకిక) యంత్రము నుండి వలె బయలు వెడలిన వైద్యుతమగు జ్యోతి - ప్రపంచమున ప్రసరించును.

**ప్రభ:**- పూర్వ శ్లోకమున తాంత్రిక మంత్రము - ప్రాణముల జ్వలింపజేయునని చెప్పఁబడినది. ఆ ప్రాణోద్దీపన ప్రశస్తి - యిచట నుపమ చేత వ్యాఖ్యానింప బడుచున్నది. లోకమునందు లౌకిక సామగ్రుల చేత జలము నుండి విద్యుచ్ఛక్తిని గలిగించుట కొకానొక యంత్రము నిర్మింపఁబడుచున్నది. ఆ యంత్ర విశేషము నుండి విద్యుచ్ఛక్తి యావిష్కృతమై బహిర్లోకమున ప్రసరించుచున్నది. అట్లే తాంత్రిక మంత్ర సాధనము చేత సాధకుని నుండి వైద్యుతమగు జ్యోతి యావిష్కృతమై, వెలుపల నంతటను ప్రసరించును.

మూ॥ నతస్యచేతో వికృతేర్వశేభవే
న్నతస్య దృష్టి ర్విషయై ర్వికృష్యతే
నతస్యరోగై రవకృష్య తేవపుః
సవిత్రి! యస్తే భజతే మహామనుమ్॥ 6

సవిత్రీ! ఎవఁడు నీ మహామంత్రమును సేవించునో, వాని మనస్సు వికృతికి (మార్పునకు) వశపడదు. (ధీరమగును) వాని దృష్టి విషయముల చేత నాకర్షింపఁబడదు. వాని శరీరము రోగముల చేత అపకర్షము నొందదు.

**ప్రభ:**- నీ మహామంత్రోపాసకుని మనస్సు - వికారము నొందదు. వాని బుద్ధిని విషయము లాకర్షింపఁజాలవు. (బుద్ధి బలవంతమగును) వాని మేను - వ్యాధుల చేత బాధితము కాదు. వాని శరీరము - యోగాగ్నిమయమగును.

'నతస్యయోగో నజరానమృత్యుః
ప్రాప్తస్య యోగాగ్నిమయం శరీరమ్॥'



''యోగాగ్నిమయమగు శరీరము నొందినవానికి రోగము లేదు. జరలేదు. మృత్యువు లేదు'' అని శ్రుతి చెప్పుచున్నది.

**అవ:**- ఏ మహామంత్రము చేత - మనో వికార - విషయాకృష్టి - రోగ - తిరస్కారము కలుగునో, ఆ మహామంత్రము నుత్తర శ్లోకము చేతఁ జెప్పుచున్నాఁడు.

మూ॥ స్మరన్తి మాయాంగగనాగ్ని శాన్తిభిః
సహేచ్ఛభాసా సహితాభిరమ్బికే!
తథారసజ్ఞాం ద్రుహిణాగ్ని శాన్తిభి
ర్భణన్తి దోగ్ధ్రీంతు ఖషష్ఠబిన్దుభిః 7

అంబికా! శుభ్రకిరణుఁడగు చంద్రునితోఁ గూడిన (నిండు సున్నతోఁ గూడిన) ఆకాశ - అగ్ని - శాంతుల చేత (హకార - రేఫ- ఈకారముల చేత) మాయను స్మరింతురు. (''హ్రీం'' అనునక్షరము చేత మాయను చెప్పుదురు) అట్లే చంద్రునితోఁగూడిన (నిండు సున్నతోఁగూడిన) బ్రహ్మ - అగ్ని - శాంతుల చేత (కకార - రేఫ- ఈకారములచేత - అనఁగా; 'క్రీం' అను నక్షరము చేత) రసజ్ఞను చెప్పుదురు. ధేను బీజమును మాత్రము - ఆకాశ - షష్ఠస్వర - బిందువుల చేత (హకారా - ఊకార అనుస్వారముల చేత - అనఁగా; 'హూం' అను నక్షరము చేత) చెప్పుదురు.

**ప్రభ:**- హ్రీంకారమును మాయాబీజముగాను, క్రీం కారమును రసనాబీజముగాను, హూం కారమును ధేను బీజముగాను చెప్పుదురని భావము.

**అవ:**- మహామంత్రత్రయమును దెలిపి - తద్దేవతల నుత్తర శ్లోకముచేఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ అభణ్యతాద్యా భువనేశ్వరీబుధై
రనన్తరా మాతరగాది కాలికా।
ప్రచణ్డచణ్డీ పరికీర్తితా పరా
త్రయేఽప్యమీతే మనవో మహాఫలాః॥ 8

మాతా! ఆద్యయు, హ్రీంకారవాచ్యయు, అగుమాయ - పండితుల చేత భువనేశ్వరియని చెప్పఁబడుచున్నది. క్రీంకారవాచ్యయగు రసజ్ఞ - కాలికయని చెప్పఁబడుచున్నది. హూంకార వాచ్యయగు ధేను బీజము - ప్రచండ చండియని కీర్తింపఁబడుచున్నది. ఈ నీ మంత్రములు మూడును గూడ - మహా ఫలముగలవి. ఇందు ప్రచండ చండినే చిన్న మస్తయనియు, వజ్రవైరోచని యనియుఁ జెప్పుదురు.

మూ॥ ఉపాధిభూతం శుచినాభసం రజో
దధాతి సాక్షాద్ భువనేశ్వరీ పదమ్
తదాశ్రయా వ్యాపకశక్తి రద్భుతా।
మనస్వినీ కాచన కాలికేరితా॥ 9

అన్యసంపర్క రహితమును, స్వతః సిద్ధమును, సర్వలోకమునకును ఉపాదానకారణమగుట చేత ఆశ్రయ భూతమును, అగుచు, ఆకాశ సంబంధియగు రేణువు - (అణుస్వరూపమగు రజస్సు) భువనేశ్వరియను నామమును భరించుచున్నది. ఆ యాకాశ రేణుసమాశ్రయము, ప్రాజ్ఞయు, అనిర్వాచ్యయు, అద్భుతయునగు వ్యాపకశక్తి 'కాలిక' అని చెప్పఁబడుచున్నది.

ప్రభ:- సర్వజగదుపాదానమూలద్రవ్య భూతమగు ఆకాశాణువు "ఆకాశో గోలేభ్యోయద్ వితరతీ నిజరజశ్చ్యాదన్నమ్" ఇత్యాది శ్లోకములయందు ప్రథమ స్తబకమున వ్యాఖ్యానింపఁబడినది. అయణువే "భువనేశ్వరి" అని చెప్పఁబడుచున్నది. సర్వ వ్యాపిని యగు చిచ్ఛక్తి - 'కాలిక' అని చెప్పఁబడుచున్నది.



అవ:- తృతీయయగు మూర్తిని దెలుపుచున్నాఁడు.

మూ॥ అమర్త్య సామ్రాజ్యభృతః పురస్థితా।
విశాలలోకత్రయ రఙ్గనర్తికా।
పరాక్రమాణా మధినాయికోచ్యతే
ప్రచణ్డచణ్డీతి కలా సవిత్రి తే॥ 10

జననీ! దేవరాజ్య భర్తయగు నింద్రుని (ప్రపంచమున) ప్రవర్తింపఁజేయునదియు, విశాలమగు భూలోక - భువర్లోక, సర్వర్లోకత్రయమను రంగస్థలమున వర్తించునదియు, పరాక్రమములకు (వివిధములగు విక్రమములకు) అధినాయికయు, (అధిదేవతయు) అగు నీకళ - ప్రచండచండియని చెప్పఁబడుచున్నది.

ప్రభ:- ఇట్లు చెప్పుట చేత నీమెకు, ఇంద్రాణి (శచి,) అను నామాంతరము చెప్పఁబడినది, ప్రచండచండికి ప్రధానమగునది - క్రియాశక్తి - కాళికి ప్రధానమగునది - వ్యాపిని యగు జ్ఞానశక్తి - భువనేశ్వరి ఈ యుభయమునకును మూలము. ఈ ముగ్గురును మహామంత్రత్రయ దేవతావిభూతులుగా ప్రతిపాదింపబడిరని తెలియునది.

మూ॥ స్మరన్ మనుం రోదితి భక్తి మాంస్తవ
ప్రగృహ్యాపాదం మునిరమ్బ! లమ్బతే।
ఫలంచిరాయ ప్రథమః సమాప్నుయాత్
పరో మరన్దం పద ఏవవిన్దతి॥ 11

అమ్మా! భక్తిమంతుఁడు - నీమంత్రమును ధ్యానించుచు ఏడ్చుచుండును. నైష్ఠికుఁడగు ముని (తపస్వి) నీ పదమును గ్రహించి, వ్రేలాడును. అందు ప్రథముఁడగు మంత్రధ్యాయి - చిరకాలమునకు ఫలము నొందును. ద్వితీయుఁడగు ముని - వెంటనే రసమును (పదారవిందమును) ఆస్వాదించును.

**ప్రభ:-** మంత్రమును ధ్యానించువాఁడు వెంటనే ఫలము నొందఁడు. పదావలంబియగు ముని మాత్రము - వెంటనే ఫలాంతస్సారము నొందును. ఇదియే మునికిఁ గల విశిష్టతయని తెలియునది.

మూ॥ పదం తవాన్విష్ట మనేకదా ముదా
హృదన్తరే స్పృష్ట మి వేద మప్యృతే!
పలాయతేఽథోఽహ మనన్తరం శుచా
పరాత్పరే రోదిమి మన్త్రశబ్దతః॥ 12

పరాత్పరవగు జననీ! పలుమార్లు ప్రీతితో హృదయములోపల వెదుకఁబడిన యీ నీపదము స్పృశింపఁబడినట్లగుచున్నది. అప్పుడు నీ పదస్పర్శ మాత్రమున, ఈయహం బుద్ధి (నేను) స్వయముగా పరుగెత్తుచున్నది. (లయించుచున్నది) తరువాత (పదస్పర్శ కలుగకుండునపుడు) శోకము చేత మంత్రశబ్దముతో నేడ్చుచుందును.

**ప్రభ:-** అనేక పర్యాయము లొక్క ముహూర్తమాత్రము నీచరణము స్పృశింపఁబడుచున్నది. కాని చక్కగా గ్రహింపఁబడి ధరింపఁబడుట లేదు. నీ పదము స్పృశింపఁబడినపుడు లయించిన నేను (అహం బుద్ధి) తదుపరి మరల నుదయించుచున్నది. అప్పుడు శోకాకులుఁడనగు నేను మంత్ర శబ్దముతో రోదనము చేయుచుండునని భావము. దీని వలన - ఆచార్యుఁడగు నీకవి - ఆత్మనిష్ఠను, మంత్రయోగమును, క్రమముగా ననుష్ఠించెనని తెలియుచున్నది.

మూ॥ భణన్తి సన్తో మరుతాం సవిత్రి! తే
మహోమనుం త్వత్ పదభాస్కరాతపమ్।
తతోహి మూలాత్ స్వర ఏష నిర్గత
స్తపత్యఘౌఘం జరయన్మహోమయః 13



మరుత్తులకు సవిత్రివగు నింద్రాణీ! విద్వాంసులు - నీ మహా మంత్రమును నీచరణమేయగు సూర్యాతపము (సూర్యప్రకాశము) గాఁ జెప్పుదురుగదా! ఆ మూలస్థానము నుండి బయలు వెడలినదియు, మహోమయమును, (జ్యోతిర్మయమును) అగు ఈ మంత్రనాదము - పాప సమూహమును క్షయింపఁజేయుచు జ్వలించుచున్నది.

**ప్రభ:-** నీ మహామంత్రనాదము - భవత్పాదజ్యోతిర్మయ మగుచున్నది. కావుననే పాపములను తొలఁగించుచు జ్వలించుచున్నది.

మూ॥ సవిత్రి! సాక్షాచ్చరణస్య తే ప్రభాం
విధారయం స్తజ్జనిమూలమార్గణే
ముహుర్ముహుస్సోఽహమజే! ధృతోద్యమః
పథా మహర్షీ రమణోఽబభాణయమ్. 14

అజవగు జననీ! ప్రత్యక్షముగా నీపద దీప్తిని (మంత్రనాదమును) ధరించుచున్న వాఁడనగు నేను - రమణ మహర్షి చూపిన మార్గము చేత- జపింపఁబడుచున్న మంత్రము యొక్క ధ్వనికి మూలమగు స్వరూపమును వెదకుటయందు మాటిమాటికిని ప్రయత్నము నూనియున్నాను.

**ప్రభ:-** బహు కాలమునుండియు మంత్రసాధనము నొనర్చుచున్నను, కృతార్థుడను గాని నేను భగవంతుఁడగు రమణమహర్షి నాశ్రయించి - తపఃస్వరూపమును దెలియఁగోరితిని. ''**జపింపఁబడుచున్న మంత్రము యొక్క ధ్వని - ఎక్కడ నుండి వచ్చినదని యన్వేషించునెడల ఆయన్వేషణము - తత్ ధ్వనిమూలమగు స్వరూపము నొందించును. అదియే తపస్సు**'' అని యాభగవానుఁడుపదేశించెను, తదుపదిష్ట మార్గమున మంత్రనాద మూలాన్వేషణమున నిత్యమును ప్రవర్తించుచున్నానని తాత్పర్యము. మహోమయమే మంత్రనాదమని

పూర్వ శ్లోకమునఁ జెప్పఁబడినది. కావున పదప్రభయనఁగా మూలస్వరూపము నుండి యుదయించిన మంత్రనాదమే యర్థమగుచున్నది.

మూ॥ అహమ్పదార్థో యదిచిల్లతా తతా
కిమేషదోర్గ్రీ మనుభావతోఽపరః।
అహం యది ప్రాణ నినాద వైఖరీ
నకూర్ప ఆఖ్యాతు మసేతిశక్యతే॥ 15

అహమను పదము యొక్క అర్థము (శక్య సంబంధియగు లక్ష్యార్థము) చిల్లతా (ప్రజ్ఞావల్లి) యగునెడల, నీయర్థము - ధేనుబీజమగు హూంకారము యొక్క అర్థము కంటె వేఱుకాదు అహమను పదము ప్రాణనాదము యొక్క స్థూలాకృతియగు వైఖరీ నాదమగునెడల నది (అహమనుపదము) ప్రాణనాదవైఖరి కాదనుటకు శక్యము కాదు.

**ప్రభ:-** అహం పదార్థమును, దోర్గ్రీమంత్రార్థమును, చిత్తేయగును. ఇట్లే, అహం శబ్దమును, హూంకారమును గూడ - ప్రాణ నాదమేయగును. కావున శబ్దమువలనను, అర్థము వలననుగూడ - అహమ్పద - దోర్గ్రీమంత్రములకు భేదము లేదని భావము.

మూ॥ పరేతు యాం చేతనశక్తి మామన
న్త్యభాణి సాకుణ్డలినీతి తాన్త్రైః
విలక్షణానామ చమత్కృతిర్జడాన్
ప్రతారయత్యాగమసార దూరగాన్॥ 16

వేఱొక పక్షమున - ఇతరులు - దేనిని చేతనశక్తి యని కీర్తింతురో, దానిని కుండలినియని తాంత్రికులు చెప్పుదురు. అయ్యో! విలక్షణ (అసాధారణి)యగు చమత్కృతి - తంత్రశాస్త్రముల సారము నెఱుఁగని జడులను వ్యామోహపఱచుచున్నది.



**ప్రభ:- తాంత్రికులు (శాకాగమికులు) చితి శక్తికి కుండలిని యను పేరిడిరి.** ఆ నామకరణము - విలక్షణమగు చమత్కృతి యగుచున్నది. 'కుండలిని' అనుపదము వినిన తోడనే సర్పముపస్థిత మగును కాని, చేతనశక్తియుపస్థితము కాదు. కావుననే యిది - విలక్షణమగు చమత్కారమగుచున్నది.

మూ॥ భవత్యఖణ్డానుభవః ప్రబోధినా
మతీవ సూక్ష్మానుభవశ్చ యోగినామ్।
కరంగతా స్సర్వవిధాశ్చ శేరతే
మహేశ్వరీమన్త్ర పరస్య సిద్ధయః. 17

ప్రకృష్టమగు జ్ఞానము గలవారికి దేశకాల పరిచ్ఛిన్నముకాని అఖండమగు అనుభవము కలుగును. షట్చక్రభేదన మార్గము ననుసరించుయోగులకు అత్యంతమును, సూక్ష్మమగు ననుభవము కలుగును. మహేశ్వరీ మంత్ర సాధకునకు సర్వ విధములగు అద్భుత సిద్ధులును హస్తగతములగును.

**ప్రభ:-** ప్రబోధము గల జ్ఞానికి సర్వమును బ్రహ్మ స్వరూపమగుట వలన బాహ్యాంతర భేదము కలుగదు. స్థూలసూక్ష్మ శరీరములయందున్న యోగికి పరమార్థ తత్త్వము - అంతర్దృష్టి గమ్యమగును. ఆయనుభవము - సూక్ష్మమని చెప్పఁబడుట వలన అల్పమని భావింపఁగూడదు. దేవీమంత్రసాధకునకు సిద్ధులన్నియుఁగూడ వశపడును.

మూ॥ సహస్ర సంఖ్యాని జనూంషివా మమ
ప్రియాణి భక్తి స్తవచేద్ భవేభవే
తవ స్మృతించేద్ గలయేన్న సమ్మదం
కరోతి మోక్షోఽపి మమేశ వల్లభే! 18

ఈశ్వర ప్రియవగు జననీ! ప్రతి జన్మమునందును నాకు నీయందు భక్తి కలుగు నెడల వేయి జన్మములయినను నాకు ప్రియములే యగును. నాకు నీయందలి ధ్యానమును తొలఁగించునెడల, మోక్షమయినను గూడ నాకానందమును గూర్పదు.

ప్రభ:- ముక్తి కంటెను గూడ నీయందలి భక్తియే – నాకు మిక్కిలి ప్రియమని భావము.

మూ॥ వినైవదృష్టిం యది సత్ప్రశిష్యతే
నసత్తయాఽర్థః ఫలహీనయాత్వయా।
ఇదం తు సత్ కి న్న్వసతో విశిష్యతే
న తాత ముక్తోపలయో స్తదాభిదా॥ 19

దృష్టి లేకయే (ప్రజ్ఞలేకయే) సత్తు (ఉనికి) మాత్రమే మిగిలిన యెడల ఫలహీనమగు అసత్తచేనగు ప్రయోజనము లేదు. ప్రజ్ఞ లేకున్నను గూడ సత్తు - అసత్తుకంటె విశేషించునాయేమి? ఓయీ! అట్లయిన యెడల అప్పుడు ముక్త పురుషునకును, బండరాతికిని భేదము, కలుగదు.

ప్రభ:- ప్రజ్ఞా విరహితమగు సత్తునకును – (భావమునకును) అసత్తునకును, (శూన్యమగు అభావమునకును) విశేషమేమియు నుండదు. కావున సర్వవృత్తివి రహితమగు ముక్తావస్థ మిగిలియుండునపుడు గూడ ప్రజ్ఞయుండవలయును. లేని యెడల – ఆముక్తావస్థ – నిరర్థకమే యగునని భావము.

మూ॥ శుచాం నివృత్తిర్యది ముక్తిరిష్యతే
సుఖప్రవృత్తిర్యది నాత్రవిద్యతే
సదేవచేత్ తత్ర మతిర్నభాసతే
జడం విముక్తాద్ వచ సైవ భిద్యతే॥ 20



''శోకనివృత్తియే ముక్తి'' యగునెడలను, అముక్తియందు సుఖప్రవృత్తి లేని యెడలను, అందు – కేవల సత్తుమాత్రమే మిగిలి, బుద్ధి – భాసింపకుండిన యెడల, అముక్తపురుషుని కంటె – జడమగు వస్తువు వాఙ్మాత్రముననే (మాట చేతమాత్రమే) భేదించును.

ప్రభ:- సర్వదుఃఖనివృత్తియే – ముక్తియగు నెడల, జడపదార్థమునకును, ముక్తునకును, భేదమే యుండదని భావము. ముక్తి యందు వ్యతిరేకము చేత దుఃఖనివృత్తి మాత్రమే కాక, ఆనంద ప్రవృత్తి కూడ కలుగుననియు, కేవలసత్తయే గాక, చిత్తు (ప్రజ్ఞ) గూడ నందుండుననియు, భావము.

మూ॥ మతిః పరాచీ వ్యవహారకారణం
భవేత్ ప్రతీచీ పరమార్థ సమ్పది
ఉభేదిశా యస్య మతిర్విగాహతే
పదాచ మూర్ధ్నాచ స సిద్ధ ఇష్యతే. 21

బహిర్ముఖియగు బుద్ధి ( ఈలోకమున) వ్యవహరించుటకు కారణమగుచుండును. అంతర్ముఖియగు బుద్ధి – పరమ పురుషార్థ సంపదకు కారణమగును. ఎవ్వని యొక్క బుద్ధి (ప్రజ్ఞ) పరాగ్ దృష్టిని, (బాహ్య దృష్టిని) ప్రత్యగ్ దృష్టిని, (అంతర్దృష్టిని) గూడ ప్రవేశించునో, (పొందునో) ఆయోగి – పాదము చేతను, (హృదయాకాశము చేతను) శిరస్సు చేతను, (సహస్రారము చేతను) గూడ సిద్ధుఁడగుచున్నాఁడు.

ప్రభ:- వెలుపలి చూపు చేత లోక వ్యవహారమును, లోపలి చూపు చేత – ఆత్మసాక్షాత్కారమును, కలుగును. ఇందు మొదటి చూపు – అజ్ఞానకును, రెండవ చూపు – ప్రాజ్ఞనకును, గలుగును. జీవన్ముక్తుఁడగు యోగికి మాత్రము, పరాక్-ప్రత్యగ్ దృష్టులు రెండును (వెలిచూపు – లోచూపు, లభించును. కావున నతఁడు–

సహస్రారము చేత - పరాగ్దృష్టి సిద్ధుఁడును, హృదయాకాశము చేత - ప్రత్యగ్ దృష్టి సిద్ధుఁడునుగూడ నగును.

**విశే:-** మూలమునందున్న పాదశబ్దమునకు హృదయాకాశమర్థ మనియు మూర్ధ శబ్దమునకు సహస్రార మర్థమనియు గ్రహించునది. పరాగ్ దృష్టి ప్రజలందఱకును అవశముగానే గలుగును. గాని ప్రత్యగ్ దృష్టియట్లు సిద్ధించునది కానేరదు. ప్రత్యగ్ దృష్టి గలవానికి పరాగ్ దృష్టి యందుఁగూడ స్వవశమైన సిద్ధికలుగును, జీవన్ముక్తుఁడయిన పురుషునికే ప్రత్యగ్ దృష్టి యందగు స్వ స్థితిని విడువక వెలుపలి వ్యవహారము నొనర్చుటకుఁ దగిన ప్రజ్ఞ కలుగును - ఈ యాశయమునే వేఱొక విధమున వాజస నేయుల శ్రుతి ( ఈ శావాస్యోపనిషత్తు) చెప్పుచున్నది.

''విద్యాం చా విద్యాంచ యస్తద్ వేదోభయంసహ।
అ విద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే॥

మూ॥ రూఢం పదం యస్యమతేః సదాన్తరే
సనాధియోఽగ్రేణ బహిశ్చరన్నపి
సవిత్రి! మగ్నస్త్వయి సమ్ప్రకీర్త్యతే
నతస్యభీః సఞ్చరతోఽపి సంసృతేః. 22

సవిత్రీ! ఎవని బుద్ధికి లక్ష్యమగు పదము ( గమ్యస్థానమగు సాక్షాత్కారము) హృదయాంతరము నందెల్లప్పుడును ధృఢమగునో, ఆ మనుష్యుఁడు - ఆ బుద్ధియొక్క మూలముచేతనుగాక, అత్యంత బాహ్యాంశమగు అగ్రము చేత - బహిర్విషయములయందు సంచరించుచున్నను, చిత్ స్వరూపిణివగు నీయందు మగ్నుఁడని ( గాఢమగు స్థితిని బొందిన వాఁడని) మిగుల కీర్తింపఁబడుచుండును. కావుననే, యిట్లు వెలుపల దిరుగుచున్నను గూడ, ఆ పురుషునకు - జనన మరణ రూపసంసారము వలని భీతి కలుగదు.



**ప్రభ:-** హృదయనిష్ఠుఁడగు పురుషుని బుద్ధి - వెలుపలఁ దిరుగుచున్నను, విషయముల చేత బాధింపఁబడునది కానేరదు. హృదయస్థానమున (చిదాకాశమున) దృఢమగు స్థితి నొందిన సిద్ధపురుషునకు పరమాత్మ సాక్షాత్కారము వలన అమృత స్వరూపము కలుగునను నంశము - నిగమాగమ పురాణేతిహాస ప్రసిద్ధము. జీవించియు ముక్తుఁడగు నతనికి - దేని వలననుగూడ సంసారము కలుగదు. కావున సంసార భీతికూడ నొకప్పుడును గలుగదని భావము.

మూ॥ విచిన్తనే చిన్తనశక్తి మద్భుతాం
విలోకనే లోకనశక్తి ముజ్జ్వలామ్
ప్రభాషణే భాషణశక్తి ముత్తమాం
నిభాలయం స్త్వాం విషయై ర్నజీయతే॥ 23

ధ్యానకర్మయందు అద్భుతమగు ధ్యానశక్తిగాను, దర్శనకర్మయందు ఉజ్జ్వలమగు దర్శనశక్తి గాను, ప్రభాషణ ( ప్రవచన) కర్మయందు - ఉత్తమమగు భాషణ శక్తిగాను, నిన్ను గుర్తించిన నైష్ఠికుఁడగు పురుషుఁడు - ఇంద్రియాకర్షకములగు విషయముల చేత - పరాభవింపఁబఁడడు.

**ప్రభ:-** ఆశ్చర్యకరియగు చింతనకర్త్రియు, ప్రదీప్తయగు దర్శనకర్త్రియు, ఉత్తమయగు వాక్ఛక్తియు ఒక్కతె యగు నమ్మయే యగుచున్నది. కావున ''ధ్యానించుదానవు. వీక్షించుదానవు, భాషించుదానవు గూడ - నీవే'' యని యుపాసించు వానికి జితేంద్రియత్వము కలుగునని భావము.

మూ॥ విలోకమానస్య విలోకనంతవే
ర్విలోక్యమాసేషు విహాయసక్తతామ్।
విలోచనే సన్నిహితా నిరన్తరం
విధూత భీతిర్విబుధస్తుతా శివా. 24

మృత్యు శిరస్కమును, (మరణాది రూపమును,) బహు విధమును అగుచు, ఆశ్రితజనమునకుఁ గలుగు భీతి నపనయించునదియు, విబుధుల చేత (విద్వాంసుల చేతఁగాని దేవతల చేతఁగాని) స్తుతింపఁబడునదియు, శివయు, నగు భగవతి – దృశ్యములగు విషయముల యందు సంగమును విడిచి, విలోకనమును (దర్శనకర్మను) విలోకించుచున్న క్రాంతదర్శియగు కావ్యనిర్మాత యొక్క విలోచనము నందు (దృష్టియందు) సన్నిహితయగు చుండును. (సాన్నిధ్యము నొసఁగుచుండును.)

ప్రభ:- విషయముల తోడి సంబంధమును విడిచి విషయములందు ప్రవర్తించుచున్న దృష్టికి ద్రష్టయగునతఁడు, కావ్యస్రష్టయగుచున్నాడు. క్రాంతదర్శియగు నతని దృష్టియందు – భగవతి – నిత్య సన్నిహితయు, సర్వభయాపహయు, నయివెలయుచుండునని భావము. కవులకీ యుపాసన మావశ్యకమని తెలియునది.

మూ॥ అయం భయానాం పరిమార్జకస్సతాం
సమస్తపాపౌఘ నివారణక్షమః।
మనోజ్ఞ వంశస్థగణో గణేశితు
ర్మనో మహేశాబ్దదృశో ధినోత్వలమ్॥ 25

సజ్జనుల భయములనన్నిఁటిని నివారించునదియు, సమస్త పాపసమూహమును ధ్వంసము చేయుటకు శక్తి గలదియు, గణపతికవి చేత రచియింపఁబడినదియు, అగు వంశస్థవృత్తగణము – మహేశ్వరుని యబ్జాక్షియగు పార్వతియొక్క మనస్సును మిక్కిలి సంతోషింపఁ జేయునుగాత!

ఇది – సవ్యాఖ్యమగు త్రయస్త్రింశస్తబకము

****



ఓం నమోభగవతే శ్రీ రమణాయ శ్రీ భారతీదేవ్యైనమః

# ఉమాసహస్రము

## (తొమ్మిదవ శతకమున – ద్వితీయ స్తబకము)

## చతుస్త్రింశస్తబకము

అవ:- ఈ ముప్పది నాలుగవ స్తబకమునందు మానవమాంగల్యము కొఱకు భరతఖండక్షేమ సంపాదనేచ్ఛచేత – భగవతిని బహు విధముల ప్రార్థించుచున్నాఁడు.

మూ॥ విదిత మహిమా విశ్వాధానా దనేక విధాద్భుతాత్
ప్రథితచరితః శర్వాలోక ప్రతాప వివర్ధనాత్
ప్రకటితగుణః పాపధ్వాన్త ప్రసార నిరోధనాత్
ప్రదిశతు శివాహాసో భాసాంనిధిః కుశలానిమే. 1

అనేక ప్రకారములగు నాశ్చర్యములు గల జగత్తును సృజించుట వలన తెలియఁబడిన మహిమ గలదియు, రుద్రుని యొక్క ఆలోకప్రతాపమును వృద్ధినొందించుట వలన – ప్రఖ్యాతమయిన చరిత్రము (నడవడి) గలదియు, పాపములను, చీకటుల యొక్క వ్యాప్తిని; నిరోధించుట వలన ప్రకాశింపఁజేయఁబడిన తేజో, బల, వీర్యాదిగుణము గలదియు, కాంతులకు నిధియు అగు పార్వతీహాసము నాకు కుశలముల నొసఁగుగాత!

ప్రభ:- దేవీహాసము – నానావిధాద్భుత జగత్ సృష్టివలన – నిజమహిమను తెలియఁజేయుచున్నది. పరమేశ్వరదృష్టికి వీర్యమును గలిగించుట వలన విఖ్యాతమగు చేష్టితము గలిగియున్నది. పాపతిమిర ప్రసారమును తొలగించుట వలన గుణములను